క్లుప్తంగా

మాజీ ఎంపీపీ మంగ్యానాయక్ మృతి



మంగ్యనాయక్ (ఫైల్)

కుల్కచర్ల: మండలానికి మొట్టమొదటి ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించిన మంగ్యానాయక్ (70) శుక్రవారం రాత్రి మృతి చెందారు. శనివారం స్వగ్రామం దాస్యనాయక్ తండాలో కుటుంబసభ్యులు ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. 1985 సంవత్సరంలో మంగ్యనాయక్ కుల్కచర్లకు ఎంపీపీగా పని చేశారు. మండల బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, రైతుబంధు మండల కమిటీ అధ్యక్షుడు రాజు మంగ్యనాయక్ పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 1985లోనే గిరిజనుల నుంచి వచ్చిన నాయకులు మంగ్యనాయక్ అని వారి సేవలు, జ్ఞాపకాలు కుల్కచర్ల మండలంలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయన్నారు. మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శంకర్‌నాయక్, పటేల్ చెరువు తండా సర్పంచ్ శాంతిబాయితులసిరాం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే



ప్రమాదకరంగా మారిన మిషన్ భగీరథ వాల్వ్

అనంతగిరి: పట్టణంలోని అస్సాం బేకరి నుంచి జెడ్పీ బాలికల పాఠశాలకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో మిషన్‌భగీరథ వాల్వ్ పైకప్పు పూర్తిగా ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఒకేసారి రెండు వాహనాలు వచ్చినప్పుడు కష్టంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఆదమరిస్తే ప్రమాదం అవకాశం ఉంది. ఈ సమస్యను సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వాల్వ్‌పై కప్పు వేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బ్రేకులు పడక..

ఆటోట్రాలీ బోల్తా

ఒకరు మృతి, ఆరుగురికి గాయాలు



బోల్తాపడిన ట్రాలీ ఆటో

చేవెళ్ల: పూలలోడ్‌తో వెళ్తున్న ఆటోట్రాలీ బోల్తా పడిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని తంగడపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పులుసుమామిడి గ్రామానికి చెందిన ఖాజాపాష (37) కొమరయ్య, సందీప్‌రెడ్డి, మల్లారెడ్డి, దేవయ్య, రంగారెడ్డిలు సాగు చేసిన పూలను అదే గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి ట్రాలీ ఆటోలో నగరంలోని గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌కు తరలిస్తున్న క్రమంలో తంగడపల్లి సమీపంలోకి రాగానే ఆటో బ్రేక్‌లు పనిచేయక పోవడంతో అదుపు తప్పి బోల్తాపడింది. దీన్ని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, మిగతా వారు స్వల్పంగా గాయపడ్డారు. వారిని మెరుగైన వైద్యం కోసం నగరంలో నిపలు ఆసుపత్రులకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆచారి గెలుపు కోసం పూజలు

మాడ్గుల: మండలంలోని ఇర్విన్ గ్రామ బీజేపీ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్ ఆధ్వర్యంలో కల్వకుర్తి ఆ పార్టీ అభ్యర్థి ఆచారి గెలవాలని అమనగల్లు వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ మెజార్టీ సాధించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజురెడ్డి, శ్రీశైలం, రమేశ్, అశోక్, మల్లేశ్, హరిశ్, భూపేశ్, గణేశ్, శేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన మైసమ్మ జాతర



అలంకరణలో మైసమ్మ తల్లి

కడ్తాల్: మైసిగండి గ్రామంలో కొలువైన మైసమ్మ జాతర ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆరురోజుల పాటు భక్త జనసందోహం మధ్య కొనసాగిన ఉత్సవాలను ఆలయ నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో స్నేహలత, శిరోలి, నాయకులు రామవత్ భాస్కర్ నాయక్, అరుణ్‌కుమార్, యాదగిరి స్వామి, చంద్రయ్య, దేవేందర్, బోడ్యా, రమాదేవి అర్చక సిబ్బంది భక్తులు ఉన్నారు.

ఫలితాలవైపే అందరిచూపు

- ఎక్కడ చూసినా అదే చర్చ
- నేతల తీరుకు ప్రామాణికంగా రిజల్ట్



క్యూలైన్లలో ఓటర్లు (ఫైల్)

కుల్కచర్ల: శాసనసభ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో అందరిచూపు ఫలితాలపై పడింది. ఏ గ్రామంలో చూసినా, ఏ టీ కొట్టు వద్ద చూసినా, ఎన్నికల రిజల్ట్ గురించే మాట్లాడుకుంటున్నారు. ఎవరు గెలుస్తారు.. ఎవరు ఓడిపోతారంటూ ఒకరికొకరు ప్రశ్నించుకుంటూ వారంతటవారే నియోజకవర్గంలో కొనసాగుతున్న రాజకీయ పరిస్థితులపై విశ్లేషించుకుంటున్నా పరిస్థితి కనిపిస్తుంది. ముఖ్యంగా పరిగి నియోజకవర్గంలోని ఉమ్మడి కుల్కచర్ల మండలానికి ప్రత్యేక స్థానం ఉంది. మండలంలో ఏ పార్టీకి మెజార్టీ లభిస్తుందో నియోజకవర్గంలో అదే పార్టీ విజయం సాధిస్తుందని స్థానిక నాయకులు విశ్వసిస్తుంటారు. గత ఎన్నికలను సైతం పరిశీలించిన అదే పరిస్థితి కనిపిస్తుంది. దీంతో ఏ గ్రామంలో ఏ పార్టీ ఎంతవరకు ప్రభావితం చేసిందో నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. నేతల పనితీరుకు ప్రామాణికం కానున్న ఫలితాలు ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో గ్రామాలకు ప్రాతినిధ్యం వహించిన నాయకుల పనితనానికి ఫలితాలు ప్రామాణికంగా మారనున్నాయి. గొప్పలు చెప్పుకున్న నాయకులు ఎవరు, క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్ఠ పరిచి ఓటర్లను ఓటింగ్ వైపు తరలించారు అన్న విషయాలు బహిర్గతం కానున్నాయి. ఒక్కో గ్రామంలోని బూత్‌ల వారీగా ఓట్లను లెక్కించనుండటంతో ఆయా గ్రామాల నాయకుల పనితీరు బయటపడనుంది. గ్రామంలో వచ్చిన మెజార్టీ ఆధారంగానే స్థానిక నేతలకు భవిష్యత్తులో పదవులు, పనులు లభించే అవకాశం ఉంది. ఏదిఏమైనా సామాన్యుల నుంచి రాష్ట్రస్థాయి నేతల వరకు అందరి దృష్టి ఫలితాలపైనే ఉండటంతో ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా ఓట్ల లెక్కింపు ఎప్పుడు ప్రారంభమవుతుందోనని వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

- మార్కెట్‌లో సన్నరకం ధర ఎక్కువ
- 115 మొక్కజొన్న సంచుల రాక

ధారూరు: ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడికి చేసిన అప్పులకు వడ్డీల భయంతో ధాన్యం తప్పనిసరిగా అమ్ముకోవల్సిన పరిస్థితి. దీంతో ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం వరిధాన్యం పోటెత్తింది. మినీ డీసీఎంలు, ట్రాక్టర్లు, ఆటోల్లో ధాన్యం సంచులను వివిధ గ్రామాలు, తండాల నుంచి మార్కెట్‌కు తీసుకొచ్చారు. బీట్లలో సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు మొదటి రకం రూ. 2,820, రెండో రకం రూ. 2,760 వరకు, మూడోరకం రూ.2,500 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. అలాగే దొడ్డు రకం ధాన్యం క్వింటాల్‌కు రూ. 2,060 నుంచి నుంచి రూ. 2,150 వరకు అమ్మకాలు జరిగాయి. మార్కెట్‌కు సన్నరకం, దొడ్డురకం వడ్లు 4,062 బస్తాలు వచ్చాయని మార్కెట్ కార్యదర్శి సిద్ధమ్మ తెలిపారు.

115 సంచుల మొక్కజొన్న రాక

మొక్కజొన్న 15 సంచులు వచ్చాయని మార్కెట్ కమిటీ కార్యదర్శి సిద్ధమ్మ తెలిపారు. క్వింటాల్‌కు రూ.2,300 నుంచి రూ. 2,310 వరకు అమ్మకాలు జరిగాయని ఆమె వివరించారు.



ధారూరు: వాహనాల్లో మార్కెట్‌కు వచ్చిన ధాన్యం సంచులు

అధికారుల నిర్లక్ష్యం..

పార్కింగ్ స్థలంగా ధారూరు బస్టాండ్



ధారూరు బస్టాండులో ఆగిన వివిధ రకాల వాహనాలు

ధారూరు: ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఉపయోగపడాల్సిన ధారూరు బస్టాండు శనివారం ప్రైవేటు వ్యక్తుల వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారింది. వర్షాకాలం ప్రారంభం నుంచి ఇంతవరకు ఏ ఒక్క బస్సు కూడా బస్టాండులోకి వెళ్లకుండా రోడ్డుపైనే ఆగి వెళ్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల నుంచి ధారూరుకు పనులపై వచ్చే వారు వాహనాలను ఆర్టీసీ బస్టాండు ఆవరణలో నిలిపి వారి పనులు ముగించుకుని తిరిగి వెళ్లే సమయంలోనే వాహనాలను తీసుకెళ్తున్నారు. తాండూర్–హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ బస్టాండు వైపు చూస్తూ వెళ్తున్న అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. వానాకాలం పోయి చాలా రోజులయింది. ఆర్టీసీ అధికారులు ఇంకా మేల్కొనకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా బస్సులను బస్టాండులోకి వచ్చి వెళ్లేలా చూడాలని వారు కోరారు.

పత్తి, వరికి పండగే!



పత్తిని ఏరుతున్న రైతు కుటుంబం

- కలిసొచ్చిన తెల్లబంగారం, వరి పంటలు
- గతేడాది దిగుబడి లేక అవస్థలు
- ఈసారి సాగు చేయలేక దిగులు
- ఫిబ్రవరిలో 12వేలకు చేరే అవకాశం
- ఈసారి పత్తికి అనుకూల వాతావరణం
- పత్తి రైతుల పంట పండింది

బొంరాస్‌పేట: 'ఈసారి పత్తి, వరి సాగు ఇంకా వేయాల్సింది'. అంటూ రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వానలు, వాతావరణం పత్తి, వరి పంటలకు అనుకూలంగా ఉంది. వరికి నిరుడు కన్నా మేలనిఆలోచిస్తున్నారు.

కాలం కలిసొచ్చింది..

వాతావరణం అనుకూలిస్తుందని భావించిన రైతులు నిరుడు ఒకే ఊళ్లో సగానికి పైగా కుటుంబాలు పత్తి పంటను సాగుచేశారు. ఒక్కో రైతు ఎకరం నుంచి ఐదెకరాల వరకు సాగు చేశారు. విత్తనాలు, మందులు, కలుపు ఇతర ఖర్చులకు ఎకరాకు రూ.16వేల నుంచి రూ.19వేలు పెట్టుబడి పెట్టారు. ఎకరాకు 20క్వింటాళ్ల వరకు దిగుబడి రావచ్చునని ఆశపడ్డారు. మొదటికాయ దశలో వానలు బాగా కురవడంతో పత్తిపంట సగానికిపైగా నష్టం వాటిల్లింది. తెల్లబంగారు అప్పుల నుంచి కడతేరుస్తుందని ఎంతో ఆశపడిన పత్తిరైతు కుటుంబాలు ఒక్కసారిగా కుదేలాయ్యాయి. ఇటు దిగుబడి దెబ్బతిని, అటు మార్కెట్లో ధరలు లేక ఎటూ తోచని పరిస్థితిలో మార్కెట్ ధర రూ.3100 పలికింది. రెండేళ్లుగా దిగుబడి లేక, మార్కెట్‌లో ధరలేదని ఇబ్బంది పడిన రైతులు ఈసారి పత్తిపై ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం పత్తి క్వింటాలు ధర రూ.5800 వరకు పలుకుతోంది. దీంతో రైతులు పత్తి పంట సాగు చేయకపోవడంపై నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

ఫిబ్రవరిలో 12వేలు?

ఈ సారి పత్తిపంటకు డిమాండ్ పెరగడంతో రైతులు ప్రభుత్వం సూచించిన మిల్లర్ల వద్ద అమ్ముకోవడం లేదు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ. 7200 ఉంది. కర్నాటక ప్రాంతానికి చెందిన వ్యాపారస్తులు పెద్ద ఎత్తున కొనుగోళ్లకు సిద్ధమయ్యారు. అక్కడ క్వింటా ధర రూ. 8వేలకు పైగా పలుకుతోంది. మరో మూడు నెలల్లో ఫిబ్రవరి వరకు క్వింటాలు ధర రూ. 12వేల వరకు పలుకుతుందని ఊహాగానాలు ఉంటుండటంతో రైతులు పత్తిని ఇప్పట్లో అమ్ముకోకకుండా ఇళ్లలో నిల్వ ఉంచుకుంటున్నారు. గతేడాది పత్తివేసి పరేషానయ్యామని, ప్రస్తుతం వేయక పరేషాన్ అవుతున్నామని రైతులు వాపోతున్నారు. నిరుడు వానలకు పత్తి పంట మొత్తం దెబ్బతిన్నది. పెట్టుబడి కూడా రాలేదు. అలాగే, రెండేళ్ల క్రితం వానలకు పాడైన పత్తి సగానికిపైగా పాడైంది. మిగిలిన పత్తిని ఏరుదామన్నా కూలీల కొరతతో ఇబ్బంది పడుతున్నాం. పత్తి ఏరివేత యంత్రాలు లేవు. మరోపక్క వాతావరణంలో మబ్బులు ఏర్పడుతుండటం మరింత ఆందోళన కలిగి ఈసారి అంతగా సాగుచేయలేదని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం పత్తి పంట సాగులో ఉన్న రైతులు మొదట దిగుబడిగా వచ్చే పంటను వీలైనంత ఎక్కువగా తీయాలి. మొదటి దిగుబడిని మిగలకుండా తీసుకోవాలి. వాతావరణం అనుకూలించకపోతే నష్టం జరగవచ్చు. ఇతర రాష్ట్రాలవారు కొనడానికి రావడంతో ఇక్కడి రైతులు మిల్లర్లకు విక్రయించడం లేదు.

దేవుడి దయ, ప్రజా ఆశీర్వాదమే గెలిపిస్తుంది



అనంతపద్మనాభస్వామిని దర్శించుకున్న మనోహర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, నాయకులు

తాండూరు కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి మనోహర్‌రెడ్డి

తాండూరు: దేవుడి దయ, తాండూరు ప్రజల ఆశీర్వాదంతో తాను ఎమ్మెల్యేగా గెలుస్తానని తాండూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లాలోని అనంతగిరిలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన అనంతపద్మనాభస్వామిని మనోహర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు కాంగ్రెస్ నాయకులతో కలిసి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాండూరు ప్రజలు సంపూర్ణ మద్దతు అందించారన్నారు. ప్రజల ఆశీర్వాదం.. స్వామివారి దయతో తాను ఎమ్మెల్యేగా గెలుస్తుననే ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన నాయకుల వల్లే తాను విజయం వైపు ఉన్నానని చెప్పారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ నీరజాబాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ పటోళ్ల నర్సింహులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్, నాయకులు బాల్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులున్నారు.

పాగా వేసేదెవరో?

- ఫైలెట్, బుయ్యని మధ్య తీవ్ర పోటీ
- క్యాంపు కార్యాలయంలో రోహిత్ మరోసారి అడుగు పెడతారంటున్న బీఆర్ఎస్ శ్రేణులు
- భవనం హస్తగతమవుతుందంటున్న కాంగ్రెస్ నాయకులు



తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

తాండూరు: నియోజకర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనంలో రెండోసారి ఎవరు కాలు పెడతారనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సిట్టింగ్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మరోసారి క్యాంపు కార్యాలయంలో కొనసాగుతారా.. లేక డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి విజయం సాధించి భవనంలో కాలుమోపుతారా అనేది మరికొన్ని గంటల్లో తేలనుంది. ఇప్పటికే రెండు పార్టీలు మేము గెలుస్తామంటే, మేము గెలుస్తామంటూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అందుకు పోలింగ్ బూత్‌ల వారీగా రెండు రోజులుగా కుస్తీలు పడుతున్నారు. మరోవైపు రెండు సార్లు ప్రభుత్వంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీపై కొంత వ్యతిరేకత ఉండటంతో మెజార్టీపై స్పష్టత రావడం లేదు. కాంగ్రెస్ పార్టీలో బలమైన కేడర్ ఉండటంతో పాటు పోలింగ్ మేనేజ్‌మెంట్‌ను పక్కాగా నిర్వహించడంతో తామే గెలుస్తామంటూ కాంగ్రెస్ నాయకులు ధీమాతో ఉన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

చేవెళ్ల అభ్యర్థి పామెన భీంభరత్

షాబాద్: తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్ ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనపై ప్రజలు విసిగి మార్పు కోరుకుంటున్నట్లు తెలిపారు. కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ గెలుపుకోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, కొమరబండ గ్రామస్తులు తదితరులున్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ గెలుపు ఖాయమని చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి భీంభరత్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని శేరిగూడ కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో పోలింగ్ జరిగిన తీరును ఆయన వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్‌దే గెలుపు అని ధీమా వ్యక్తం చేశారు. మైలారం శ్రీనివాస్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



భీంభరత్‌ను కలిసిన శేరిగూడ గ్రామస్తులు

ప్రయాణం.. నరకప్రాయం!



కంకర తేలిన పాలేపల్లి, ఐనాపూర్ బీటీ రోడ్డు

- కంకర తేలి ఇబ్బందికరంగా మారిన పాలేపల్లి, ఐనాపూర్ బీటీ రోడ్డు
- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

దోమ: గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా మారాయి. కురిసిన వర్షాలకు కంకర తేలి గుంతలుగా తయారయ్యాయి. ఏళ్ల తరబడి మరమ్మతులక నోచుకోకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్లపై అతి కష్టంగా ప్రయాణం సాగిస్తున్నామని ప్రజలు వాపోతున్నారు. కానీ, అధికారులు, పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు మండిపడున్నారు. ఎన్నికల సమయంలో మీకు అది చేస్తాం..ఇది చేస్తామని హామీలు ఇచ్చేందుకు వచ్చిన నేతలకు కంకర తేలిన రోడ్లను చూసి ముక్కున వేలేసుకునే పరిస్థితి ఏర్పడింది.

చీకటైతే నరకమే..

మండల పరిధిలోని పాలేపల్లి మీదుగా ఐనాపూర్ వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు కంకర తెలి గుంతలుగా తయారయ్యింది. దీంతో అటుగా మల్లేపల్లి, దాదాపూర్, కొత్తపల్లి, గుండాల వెళ్లే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డు కంకర తేలడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతోందని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. చీకటైతే నరకం అనుభవిస్తున్నామని ప్రయాణికులు జంకుతున్నారు. రోడ్లు కంకర తేలిన విషయం సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బీటీ రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



పాలేపల్లి నుంచి ఐనాపూర్ వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు కంకర తేలడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు నరకం అనుభవిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవలే ఓ వ్యక్తి పరిగి పట్టణం నుంచి ఐనాపూర్ గ్రామానికి వస్తుండగా జారీ పడి గాయాలపాలయ్యాడు. అధికారులు వెంటనే స్పందించి బీటీ రోడ్డును పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలి.

– కుమ్మరి జనార్దన్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి, దోమ

విజయం ఎవరిని వరించేనో?

మొయినాబాద్: హోరాహోరీగా సాగిన చేవెళ్ల పోరులో విజయం ఎవరిని వరిస్తుందో మరికొన్ని గంటల్లో తేలనుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపుపై ఎవరి ధీమాలో వారు ఉన్నారు. ఫలితం ఎలా ఉంటుందోనని నేతల్లో ఉత్కంఠ నెలకొంది.

కారు దూసుకెళ్లేనా..

బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే కాలె యాదయ్యకే మళ్లీ టికెట్ కేటాయించింది. ఆయన నియోజకవర్గంలో ముమ్మర ప్రచారం చేశారు. ఇది ఇలా ఉండగా ఈ సారి కాంగ్రెస్ గాలి వీస్తుందని ముందునుంచే ప్రచారం జరుగుతుంది.

హస్తం హవా కొనసాగుతుందా..

చేవెళ్ల కాంగ్రెస్‌కు కంచుకోట అనే పేరుంది. ఎక్కువ సార్లు కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న యాదయ్య 2014లో కాంగ్రెస్ నుంచే గెలుపొందారు. తరువాత బీఆర్ఎస్‌లో చేరి 2018లో గెలిచారు. ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిగా భీంభరత్‌కు అవకాశం ఇచ్చింది.

కమలం వికసిస్తుందా..

గత ఎన్నికల్లో బీజేపీ ఎప్పుడూ గట్టి పోటీ ఇవ్వలేదు. ఈ సారి మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం కమలం కండువా కప్పుకుని బరిలోకి దిగారు. దీంతో చేవెళ్లలో కమలం వికసిస్తుందని మొదటి నుంచి ఆ పార్టీ శ్రేణులు గట్టి నమ్మకంతో పనిచేశాయి. గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. అసలు విజేత ఎవరో కొద్ది గంటల్లోనే తేలనుంది.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు ప్రారంభం



ధారూరు: దర్గాపై దట్టి కప్పుతున్న మోయిజ్‌ఖురేషి, ముస్లిం నాయకులు

ధారూరు: మండల కేంద్రంలో సయ్యద్ కోచక్‌షా ఖాద్రి మస్తీహమ్ దమ్ జిందా షావలి దర్గా ఉర్సు ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. గత మూడున్నర దశాబ్దాలుగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. దర్గా ఉత్సవ కమిటీ ఇన్‌చార్జి బియాబాన్ కుటుంబీకులు, ఎంఐఎం మండల పార్టీ అధ్యక్షుడు మోయిజ్‌ఖురేషి, జామీయా మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను ప్రారంభించారు. శుక్రవారం రాత్రి దర్గా ఉత్సవ కమిటీ, శనివారం రాత్రి ధారూరు జామ మసీదు కమిటీ ధారూరులోని జామ మసీదు నుంచి గంధం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దర్గాపై దట్టిని కప్పి పూలమాలలు వేసి గంధం సమర్పించారు. రాత్రి కవ్వాలి, ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మతపెద్దలు ఇబ్రాహీంసాబ్, డాక్టర్ ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

మతాలు, కులాలు లేవు..

కుల, మత విభేదాలు ఎవరికి ఉండకూడదని, అందరం ఐకమత్యంగా ఉంటేనే సమాజ శ్రేయస్సుకు పాటుపడిన వారమవుతామని ధారూరు మండల ఎంఐఎం అధ్యక్షుడు మోయిజ్‌ఖురేషి పేర్కొన్నారు. శనివారం రాత్రి ఆయన గంధం ఊరేగింపులో పాల్గొని ప్రార్థనలు చేసిన అనంతరం ముస్లింలను ఉద్దేశించి ప్రసంగించారు. అందరికి భగవంతుడు ఒక్కడేనని, ఎవరు ఏ రూపంలో ప్రార్థిస్తే ఆ మేరకు వారికి సంతృప్తి కలుగుతుందన్నారు.

ఈటల రాజేందర్‌ను కలిసిన బీజేపీ నేతలు



ఈటల రాజేందర్‌ను కలిసిన బీజేపీ నేతలు

షాద్‌నగర్: బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌ను శనివారం షాద్‌నగర్ ఆ పార్టీ నేతలు కలిశారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ బీజేపీ అభ్యర్థి అందెబాబయ్య ఆధ్వర్యంలో పలువురు నేతలు హైదరాబాద్ వెళ్లి ఈటల రాజేందర్‌ను కలిశారు. అనంతరం షాద్‌నగర్‌లో జరిగిన పోలింగ్ తీరును ఆయనకు వివరించారు. ప్రజలు బీజేపీని ఆదరిస్తారనే నమ్మకం ఉన్నట్లు వారు తెలిపారు. కార్యకర్తలు, నాయకుల కృషితో బాబయ్య గెలుపు తథ్యమని చెప్పారు. ఈటలను కలిసిన వారిలో చెట్ల వెంకటేష్, అశోక్, కుడుముల బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.